

# అహం

తులసి బాలకృష్ణ

నుదుటిమీది ముంగురుల్ని పైకి తోస్తూ, జుట్టులో వ్రేళ్ళు పోనిచ్చి వెనక్కిదువ్వు కుని, మరోసారి చుట్టూ చూసాడు మాధవరావు. దైవసాక్షాత్కారమైనంత అనుభూతిని ప్రదర్శిస్తూ తన వైపే చూస్తూన్న అనేక కళ్ళు. జేబులోంచి రుమాలు తీసి, తన విశాల ఫాలభాగం మీద పొటమరించిన స్వేదబిందువుల్ని అద్దుకుని, భుజాలమీది గిరజాలని వెనక్కి విసురుకున్నాడు.

తన చుట్టూరావున్న జనంలో ప్రతి ఒక్కరికీ తనతో కరచాలనం చెయ్యా

లనీ, తనతో స్వయంగా మాట్లాడాలనీ కుతూహలంగా వుంది. కానీ ఎవ్వరికీ ధైర్యం చాలడంలేదు. ఆ వూళ్ళో బాగా పలుకుబడివున్న వ్యక్తి కాబట్టి తన యెదురుగా నిల్చున్న ఖద్దరు బట్టల ఆయ నకి మాత్రం ఆ భాగ్యం లభించింది.ఆఖ రుగా ఒక్కసారి అందరివైపూ చూసి, యెదుటి ఆయనతో "వస్తానండి" అని, గ్రీన్‌రూములోకి వచ్చేశాడుమాధవశర్మ. అతను లోపలికి వస్తూనే గ్రీన్‌రూము తలుపులు మూసుకున్నాయి. ఇంకెవ్వరికీ అందులోకి ప్రవేశం లేదన్నమాట. గ్రీన్ రూములో అప్పటివరకూ వున్న నవ్వులూ, కేరింతలూ ఒక్క క్షణంలో మాయమయ్యాయి. అతి నిశ్శబ్దంగా అందరూ రంగు తుడుచుకుని, బట్టలు మార్చుకుంటున్నారు.

మాధవశర్మ నిలువుటద్దం ముందు నిల్చునిమరోసారి తనని చూసుకున్నాడు. యధాలాపంగా మీసం మీదకి చూపుడు వేలు వెనక్కి త్రిప్పిపోనిచ్చి, కొసని పైకి నెట్టుతూ, అలవోకగా నవ్వాడు. ఆ సందర్భంలో అతని కనుబొమ్మలు విల్లులా పైకి లేచాయి ఛాతీ వుబికింది. తృప్తిగా నిట్టూర్చి కుర్చీలో కూర్చు న్నాడు. అతని వంటిమీది ఆభరణాలు ఒక్కొక్కటే తియ్యసాగారుఅనుచరులు. అది అయిన తర్వాత కళ్ళు మూసుకుని తల వెనక్కి వాల్చాడు అతను. నూనె గుడ్డతో అతని ముఖాన్ని అద్ది, సుతి మెత్తగా తుడుస్తున్నారు రంగుని. కొద్ది నిమిషాల క్రితం అత్యంత మనోహరంగా ప్రేక్షకుల కరతాళధ్వనుల మధ్య తాను ప్రదర్శించిన నాటకాన్ని, దాని తర్వాత తనని అభినందించడానికి గ్రీన్‌రూము దగ్గర గుమికూడిన ప్రేక్షకసమూహాన్నీ గుర్తు తెచ్చుకుందామనుకున్నాడు గానీ– అతనికి...గ్రీన్‌రూము బయట గుమి కూడిన జనానికి అల్లంత దూరంలో ఒంటరిగా నిలబడి, కనురెప్ప వెయ్య కుండా తనవైపే తదేకదృష్టితో చూసిన "ఆ అబ్బాయి" గుర్తుకువచ్చి, వేరే ఆలోచనలకి తావియ్యడంలేదు.

సన్నగారివట్లావుంటాడుఆ అబ్బాయి. చీకట్లో నిలబడ్డా తెల్లగా వున్నట్లుగా తెలుస్తూనే వుంది. బట్టలుకూడా తెల్లటి పైజామా, లాల్చీ వేసుకున్నాడు. తెరచి వుంచిన అతనికళ్లు ముత్యాల్లా మిలమిలా మెరుస్తున్నాయి చీకట్లో. ఇంతకుముందు రెండు మూడు ప్రదర్శనలకి కూడా అతను అలాగే దూరంగా నిలబడి తన వైపే చూడ్డం గుర్తుంది. ఒకసారి దగ్గ ర్లోనే నిలబడి, తనని ఏదో అడగబోతే, తన అనుచరులు దూరంగా తోసేసారు. ఆ అబ్బాయికి తనతో మాట్లాడాలని తహ తహ కాబోలు — వెర్రాడు. తనతో మాట్లాడమంటే అంత సామాన్య విషయం అనుకున్నాడు కాబోలు. ఎంతో మంది పెద్దలకే అది బహు కష్టసాధ్య మైనది. తనకి నాటకరంగంలో వున్న

పేరు అలాంటిది మరి. తన నాటకాలకి ముందుగా రిజర్వు చేయించుకుంటేనే గానీ టిక్కెట్లు దొరకవు. తన పేరు తెలుగుదేశం మారుమూలల్లో కూడా మారుమ్రోగుతోంది.

రంగు తుడవడం పూర్తి అవుతూనే, ఓరగా, గర్వంగా నవ్వుకుంటూ లేచి ముఖం కడుక్కోవడానికి వెళ్ళాడు మాధవశర్మ.

*  *  *

"గురూజీ! మీ రంగీకరిస్తే ఒక విషయం చెప్పుదా మనుకుంటున్నాను."- అతి వినయంగా, చేతులు కట్టుకుని, అన్నాడు వెంకట్రామయ్య.

"ఏఁవిటది?"– అర్ధనిమీలితనేత్రుడై అనుజ్ఞ నొసగేడు మాధవశర్మ.

వెంకట్రామయ్య చెప్పే విషయం నవిడానికి మాధవశర్మ నాటక సమాజ సభ్యులు అందరూ చెవులు రిక్కించి యెదురుచూస్తున్నారు.

"సుబ్బయ్య శ్రేష్ఠిగారనే వ్యాపారస్తుడొకాయన వచ్చే నెలలో మనవూళ్ళోనే ఆయన తండ్రిగారి జ్ఞాపకార్థం నాటక పోటీలు నిర్వహించబోతున్నారుట..."

"అయితే—" మధ్యలోనే అందుకుని కోపంగా చూసి, కళ్లు మూసుకుని, భ్రుకుటి ముడివేసాడు మాధవశర్మ.

"క్షమించాలి. మీరు సావధానంగా వినాలి."

"ఊఁ..."

"ఆ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనగా వచ్చిన నాటకానికి అయిదువేల రూపాయలు బహుమతిగా యిస్తారుట."

"ఏఁవిఁటి నువ్వు చెప్పేది? ముష్టి అయిదువేల రూపాయల బహుమతికోసం నటనలో ఓనమాలు రాని చవటలతో పోటీకి వెళ్ళమంటావా?"– ఉరిమినట్లు వచ్చాయి అతని పలుకులు.

అందరూకూడా చాలా బాధపడ్డారు. ఈ రోజుతో వెంకట్రామయ్యకి తమ సమాజం స్వస్తివాక్యం పలకవలసి వస్తుందనుకున్నారు. 'వెర్రిముండావాడు. చదువు సంధ్యలు అబ్బకపోయినా మాధవశర్మగారి పుణ్యమా అని, నాటక సమాజంలో వేషాలు సంపాందించుకుని, ఆయన నెలకి యిచ్చే రెండువందల రూపాయలతో బాగానే కాలక్షేపం చేస్తున్నాడు. ఇప్పుడు తెలివితక్కువకి పోయి, తన పొట్ట తనే కొట్టుకున్నాడు' అనుకున్నారు.

"గురువుగారు–క్షమించాలి నా ఉద్దేశ్యాన్ని అర్థంచేసుకోమని ప్రార్థిస్తున్నాను. ఉత్తమ ప్రదర్శనకే గాక ఉత్తమ నటుడికి బంగారుపతకం బహూకరిస్తారుట.మీరు పొందిన సన్మానాలను, సత్కారాలను చూసి సంతోషించాం. అలాగే అనేకమందిమీద మీరు ఉత్తమ నటుడిగా నిరూపించుకుని సభాసదుల సమక్షంలో బంగారు పతకం బహుమతిగా పొందడం మా కందరికీకూడా యెంతో

గర్వకారణంగా మేము భావిస్తాం. దయ చేసి నా కోరికను నెమ్మదిగా ఆలోచించండి."

మాధవశర్మ కన్నులు మూసుకుని ఆలోచనలో పడ్డాడు. అయిదు నిమిషాలు గడిచాయి. ఊపిరి వదిలితే ఆయన ఆలోచనకి భంగం కలిగి, ఆయన కోపానికి గురిఅవవలసి వస్తుందని అందరూ వూపిరి బిగపట్టుకుని కూర్చున్నారు.

నెమ్మదిగా కళ్లు తెరిచాడు మాధవశర్మ. పోటీ చెయ్యమని చెప్పలేక, వద్దనీ అనలేక ఆయన నిర్ణయంకోసం వేచి వున్నవారై, అందరూ ఆయన ముఖంలోకి చూసారు.

అధరాలపై చిరుదరహాసం చిందులాడించి, అందర్నీ ఒకసారి పరికించి చూసి, వెంకట్రామయ్య భుజంతట్టి, 'భేష్' అని, "మనం ఆ పోటీలో పాల్గొంటున్నాం. రామయ్యా-పోటీ నాటక రచన యీ రోజే మొదలుపెట్టు. పోటీకి సంబంధించిన అన్ని విషయలూ నువ్వే చూడు. పోటీ వారముందనగా రిహార్సల్సు మొదలుపెడదాం" అన్నాడు మాధవశర్మ.

"ఈ పోటీలో ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటుడు బహుమతులు మనవే గురూజీ'' అన్నాడు వెంకట్రామయ్య హుషారుగా.

గర్వంగా నవ్వుతూ లేచాడు మాధవశర్మ.అతని కళ్ళముందు బంగారుపతకం తాండవమాడుతోంది.


*　　*　　*

నాటక పోటీలు మొదలయ్యాయి. పోటీలు మొత్తం అయిదు రోజులు. మాధవశర్మ నాటకం ఆఖరిరోజున రెండవదిగా పడింది. మొత్తం పదిహేడు నాటకాలు. రోజూ మూడు నాటకాలు. దేశం నలుమూలల్నుంచీ పేరుగాంచిన నాటక సమాజాలు పోటీకి వచ్చాయి.

ఆ పోటీకి సంబంధించిన వివరాలన్నీ సేకరించి, మాధవశర్మకి తెలియజేసారు శిష్యబృందం.

ప్రతి నాటకపోటీలకీ సాధారణంగా ముగ్గురు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు కానీ యీ పోటీలకు ఒకే ఒక్కరు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్నారు.నాట్యకళలో నిష్ణాతుడైన వ్యక్తిగా భావించి కృష్ణశాస్త్రిగారిని న్యాయనిర్ణేతగా నియమించారు కార్యనిర్వాహకులు

ఆ విషయం వింటూనే నిస్సారంగా నవ్వాడుమాధవశర్మ.నాటకాలువెయ్యడం మొదలుపెట్టిన రోజుల్లో కృష్ణశాస్త్రి తనకు గురువు. అనతికాలంలోనే నటనలో విశేష ప్రజ్ఞాప్రాభవాల్ని ప్రదర్శించి, గురువును మించిన శిష్యుడు అనిపించుకున్నాడు తను. తనకంటూ ఒక నాటక సమాజాన్ని స్థాపించుకుని, తనే పదిమందికి గురువై నటనలో శిక్షణ నిస్తున్నాడు. ఈనాడు కృష్ణశాస్త్రిలాంటి




ముసలి వగ్గు తన నటనని ఉత్తమమైనదా కాదా అని నిర్ణయించడమా ? ...పగలబడి నవ్వుకున్నాడు మాధవశర్మ. 'పోనీ పాపం, ఒకప్పటి గురువు కదా – ఒకసారి వెళ్ళి పలకరిద్దామా' అనుకున్నాడు. మళ్ళీ రేపు తనకు రాబోయే బంగారు పతకం తనకి క్రిష్ణశాస్త్రితోవున్న పరిచయంవలననే వచ్చిందని ఎవరైనా అభాండంవేస్తే యెంత అవమానం అని వూరుకున్నాడు

ఆఖరిరోజున మాధవశర్మ నాటకం చూడడం కోసమైతేనేం, ఆఖరిరోజు ఫలితాలు వెల్లడిస్తారు కనుకనయితేనేం, విశేషంగా ఇసుకవేస్తే రాలనంతగా జనం వచ్చారు. సీట్లు సరిపోక అనేకమంది నిలబడిపోయేరు. తను తెచ్చుకున్న మరి కొన్ని పరికరాలతో రంగస్థలానికి క్రొత్త అందాల్ని కల్పించి, రంగురంగుల తెరలతో, లైట్లతో ఇంద్రభవనంలాంటి సెట్టింగు నిర్మాణం గావించి, పకడ్బందీగా నాటక ప్రదర్శన యిచ్చాడు మాధవశర్మ. ప్రేక్షకులందరూ రంగస్థలాలంకరణనీ, లైట్లకాంతుల వింత శోభలనీ చూసి మైమరచిపోయేరు. కరతాళధ్వనులు మిన్నుముట్టాయి.

నాటకం ముగిసిన పదిహేను నిమిషాలకి రంగు తుడుచుకుని, బట్టలు మార్చుకుని, తన బృందంతో హాలులోకి వచ్చి కూర్చున్నాడు మాధవశర్మ. కార్యనిర్వాహకులు అతనికి ప్రత్యేక శ్రద్ధతో సదుపాయాలు చూసారు. అతను హాల్లోకి వస్తూండగా పెద్ద సంచలనం కలిగింది

ప్రేక్షకులలో. తమ స్థానాల్లో మునివ్రేళ్ళ మీద నిలబడి, మాధవశర్మ సామాన్యంగా ఎలా వుంటాడోనని తహతహపడుతూ చూడసాగారు.

ఇంక ఒక్క నాటకం మిగిలింది. అది అయిన తర్వాత ఫలితాలు. ఆ పిమ్మట బహుమతి ప్రదానం జరుగుతుంది.

ఆఖరి నాటకం "జీవితం" కొద్ది క్షణాల్లో మొదలవుతున్నట్లుగా ప్రకటన జరిగింది. ప్రేక్షకులలో నిశ్శబ్దం చోటు సంపాదించుకోసాగింది.

నెమ్మదిగా తెర తెరుచుకుంది.

మాధవశర్మ ఆశ్చర్యపోతూ రంగస్థలాన్ని పరికించి చూసాడు. తమ నాటకంలోలాగ భారీ సెట్టింగులు లేవు. వెనక తెరలకి ఎటువంటి అలంకరణా లేదు. ప్రత్యేకించి లైటింగు లేదు. స్టేజిమీద వున్న ముఖ్యమైన సామాను – ఒక కుక్కిమంచం మాత్రమే. దానిమీద ఒక ముసల్ది పడుకుని దగ్గుతోంది. ఆ మంచానికి ఒకప్రక్క ఒక ప్రౌఢ కట్టెల పొయ్యిమీద వంటతో సతమతమవుతోంది. ఇంకో ప్రక్క ఒక నడివయసాయన చాపమీద కూర్చుని ముందు బల్లమీద ఏవో కాగితాలు పెట్టుకుని రాసుకుంటున్నాడు. ఆయనకు కొంచెం ప్రక్కగా స్టేజికి మధ్యగా ఒక చిన్నపిల్ల పలకమీద అక్షరాలు దిద్దుకుంటోంది. స్టేజిమీది మిగతా సామాను గానీ, మనుషులుగానీ ఒక క్రమంలో లేరు. అంతా అస్తవ్యస్తంగా వుంది. తెర తెరిచిన ఒక నిమిషందాకా డైలాగులు ఏవీలేవు. ముసలామె దగ్గు, మూలుగులు, ప్రౌఢ పొయ్యి వూదడం, చిన్నపిల్ల పలకమీద దిద్దుతూన్నదాన్ని గట్టిగా పలుకుతూండడం మాత్రం వినిపిస్తోంది. అప్పటివరకు జరిగిన అన్ని నాటకాలకి పూర్తి విరుద్ధంగా ఆ నాటక అలంకరణ వుండడంతో ప్రేక్షకులలో నిరుత్సాహపడ్డవారు, మరింత ఆసక్తిగా నాటకాన్ని చూస్తున్నవారూ కూడా వున్నారు.

మాధవశర్మ దృష్టి రంగస్థల ప్రవేశ ద్వారం వైపు మళ్ళింది.

ఉలిక్కిపడ్డాడు మాధవశర్మ. రెండుసార్లు కళ్లు టపటపకొట్టి మళ్ళీచూసాడు. ప్రవేశద్వారానికి కొంచెం ప్రక్కగా వున్న ఖాళీస్థలంగుండా దూరంగా వెలుతురులో మేకప్‌లోవున్న ఆ అబ్బాయి కనిపించాడు. అతను తనవైపే చూస్తున్నాడు. తను అతన్ని చూడగానే అతను కళ్ళు మూసుకుని, గుండెలమీద చెయ్యి పెట్టుకుని ఏదో మనసులో ధ్యానించుకుని, కనుమరుగయ్యాడు. మరుక్షణం అతను స్టేజిమీద ప్రత్యక్షమయ్యాడు.

అక్కడనుంచి డైలాగులు మొదలయ్యాయి. ఆ మధ్యవయసు దంపతుల కొడుకు యితను. ఆ పిల్ల యితని చెల్లెలు. ఆ ముసలామె అతని నాయనమ్మ. ఎవ్వరూ రంగస్థల నియమాన్ని

సరిగా పాటించకపోవడం, డైలాగులు నాటకపద్ధతిలో అనకపోవడం, యిదంతా మాధవశర్మకి చాలా విసుగు అనిపించింది. అతను, అతన్తోబాటే శిష్య బృందం లేచి, బయట వరండాలోకి వెళ్లి పోయేరు.

ఆఖరి నాటకంకూడా ముగిసింది.

న్యాయనిర్ణేత తీర్పుకి పదిహేను నిమిషాలు వుందని ప్రకటించారు. ప్రేక్షకులకు విసుగుకలగకుండా భరతనాట్యం ఏర్పాటు చెయ్యబడింది.

ఈ సమయమంతా వరండాలో మాధవశర్మ చుట్టూరా అతని అభిమానులు చేరి అతని ఘనతని కీర్తిస్తూనే వున్నారు. ఇతర సమాజాలవారు, అతనితో పరిచయానికి తహతహ లాడిపోసాగారు. బంగారుపతకం మాధవశర్మదేనని వారు నిర్ధారించేసుకున్నారు.

భరతనాట్యం ముగిసింది.

ముఖ్యకార్యకర్త వేదికమీదకు వచ్చి, ఆ పోటీలు నిర్వహించడంలోని ఉద్దేశ్యం చెప్పి, న్యాయనిర్ణేత కృష్ణశాస్త్రి గారిని గురించి చెప్పుతూ, "మహానటులు, ప్రయోక్త, రచయిత శ్రీ కృష్ణశాస్త్రిగారిని గురించి ఎరుగనివారుండరు. ఆయన గొప్పతనాన్ని యిప్పుడు మేము కీర్తించడం— సూర్యుణ్ణి దీపం వెలుతురులో చూడబూనుకోవడంతో సమానం. అటువంటి సమర్థులు ఒక్కరు న్యాయనిర్ణేతలుగా వుండటం చాలని మేము భావించి వారిని కోరడం, వారు అంగీకరించడం జరిగింది. వారిప్పుడు తమ తీర్పుని చెపుతారు" అన్నారు.

సభలో చీమ చిటుక్కుమంటే విని పించేటంతటి నిశ్శబ్దం. మాధవశర్మ చుట్టూ అతని మిత్రబృందం, శిష్య బృందం అతన్ని ఎప్పుడు ఆకాశానికి ఎత్తేద్దామా అని కాచుక్కూర్చున్నారు.

కృష్ణశాస్త్రిగారు మైకు దగ్గరకువచ్చారు. ఆయనకు డెభ్భైఏళ్ళువుంటాయి. మొహం ముడతలు పడింది. జుట్టు బాగా తెల్లబడ్డప్పటికీ గిరజాలుగా వుండటంతో అదో రకమైన హుందాతనాన్ని యిచ్చింది ఆయనకు. కళ్ళజోడు సవరించుకుని, సభనంతటినీ ఒక క్షణం పరికించిచూసి, గొంతుసవరించుకుని మాట్లాడ్డం మొదలు పెట్టేరాయన.

"సభాసదులకు కళాభివందనాలు.

"ఈ నాటక పోటీలకు సంబంధించినా తీర్పు మీరు వినేముందు నావిగా ఒక్క రెండు ముక్కలు.

"నాటకమంటేఅసహజత్వంతోకూడుకుని, అమరలోకానుభూతులు కలిగించేది కాదు—వాస్తవానికి దగ్గరగావుండి, మనని మెప్పించేది, మన కళ్లు తెరిపించేది.

"నాటకమంటే భారీ సెట్టింగులు, మైకుల మోతలు, నేపథ్యసంగీతం, రంగు రంగుల లైట్లుకాదు—నటనా ప్రాధాన్యమైనది నాటకం.

"మైకు, లైటింగు సరైనరీతిలో లేని

రోజుల్లో ఏర్పరుచుకున్న రంగస్థల సూత్రాలు యిప్పటికీ ఆచరించబడడం నా ఉద్దేశ్యంలో శోచనీయం. ప్రేక్షకుడి రసానుభూతికి భంగం కలగకుండా రంగ స్థలంమీద నటుడు ఎటు నడిచినా, ఎటు తిరిగినా, ఎలా మాట్లాడినా అది సరైన దేనని నా అభిప్రాయం.

"నా యీ అభిప్రాయాలను దృష్టిలో వుంచుకుని నేడు నేను యీ నాటక పోటీ లకు సంబంధించిన తీర్పు యివ్వబోతు న్నాను. నా యీ తీర్పుని సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను" అంటూ చేతిలోని కవరులోంచి కాగితం బయటకు తీశారు.

సభలో కరతాళధ్వనులు, ఆ తర్వాత భయంకర నిశ్శబ్దం. అందరి గుండెలూ వేగంగా కొట్టుకుంటున్నాయి. ఒక్క క్షణం ఆలస్యాన్ని కూడా భరించలేక పోతున్నారు. కనురెప్పలు వెయ్యకుండా రంగస్థలంవైపే చూస్తున్నారు.

కృష్ణశాస్త్రిగారు గొంతు సవరించు కున్నారు.

అందరి దృష్టీ ఆయనవైపే. అందరి చెవులూ ఆయన మాటకోసమే.

"ఉత్తమ ప్రదర్శన – జీవితం."

సభలో ఒక్కసారిగా కలకలం.

మాధవశర్మ తలమీద హాలు పైకప్పు కూలిపోయినట్లుగా అయ్యింది.

ఓ క్షణం కలకలం తర్వాత హాలులో హర్షధ్వానాలు మొదలయ్యాయి.

"వాస్తవానికి బహుదగ్గరగా వుంది ఆ నాటకం."

"నిజమేనండీ – నిజజీవితంలో ఒక యింటిలో జరుగుతున్న సంఘటన చూస్తున్నట్లుగా వుంది కానీ ఎక్కడా నాటకం చూస్తున్నట్లు లేదు."

"వాళ్ళు నిజజీవితంలో కూడా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులట."

—లాంటి మాటలు ప్రేక్షకుల్లో విని పించసాగాయి.

ఆ తర్వాత కృష్ణశాస్త్రిగారు చదివిన ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శన లలోకూడా తమ నాటకం పేరు లేక పోవడంతో– భూమిలోకి త్రొక్కివెయ్య బడుతున్నట్లు వుంది మాధవశర్మకి. కానీ అతనికి యింకా కొంత ఆశ మిగిలివుంది. అది – ఉత్తమ నటుడి బహుమతి – బంగారు పతకం.

మళ్ళీ గొంతు సవరించుకున్నారు కృష్ణశాస్త్రిగారు.

"ఈ నాటక పోటీలలో ఉత్తమ నట నకు ఒక నటుడికి, ఒక నటికి బహుమతు లివ్వదలుచుకున్నారు కార్యనిర్వాహకులు. ఉత్తమ నటుడికి బంగారు పతకం లభి స్తుంది. నా తీర్పు ప్రకారం ఆ బహు మతి..." అని ఆగారు.

– అందరూ వూపిరి బిగపట్టి ఆయన వైపే చూస్తున్నారు. అందర్లోనూ ఆత్రుత. మాధవశర్మ గుండెలు రెట్టింపు వేగంతో కొట్టుకుంటున్నాయి.

'...జీవితం' నాటకంలో రామం పాత్రధారి చిరంజీవికి అందుతుంది."

— అంతే! ఇంక మాటలు వినిపించ లేదు మాధవశర్మకి. ప్రేక్షకులు విని పించనియ్యలేదనీ చెప్పొచ్చు. హర్ష ధ్వానాలు మిన్ను ముట్టాయి. మాధవశర్మ మెదడులో హోరుని మించిన ధ్వని అది. అది ఆగడానికి చాలా సేపు పట్టింది

అంతలో ఎవరో భుజాలమీద ఎత్తు కుని తీసుకొచ్చి, ఆ అబ్బాయిని వేదిక మీద నిలబెట్టారు. అతని చూపు తన వైపే కేంద్రీకరించి వుండటంతో మాధవ శర్మ శరీరం కుంచించుకుపోసాగింది.

...తన అనుచరుల్లో ఎవరో తనని తట్టేంతవరకూ మాధవశర్మ యీ లోకంలో లేడు. నెమ్మదిగా వెనక్కి చూసాడు. హాలు అంతా ఖాళీ అయి పోయింది. నెమ్మదిగా లేచి, తలదించు కుని బయటకు బయల్దేరాడు. సింహ ద్వారం సమీపిస్తూండగా అతని కాళ్ళు ఆగిపోయేయి. అక్కడ కృష్ణశాస్త్రిగారు, కార్యనిర్వాహకులు, ఆ అబ్బాయి, అతని నాటకంలోని యితర నటీ నటులు వున్నారు. వాళ్ళ మధ్యగా వెళ్ళడం తల కొట్టేసి నట్లుంటుంది. అసలే అవమాన భారంతో తలబ్రద్దలయిపోతోంది. కానీ యెలాగ ? తప్పదు. వేరే ద్వారం లేదు. వాళ్ళు తననే చూస్తున్నారు కూడా. ఇప్పుడు వెనుతిరిగిపోతే మరీ నవ్వుల పాలు. అసంకల్పితంగానే అడుగులు వేస్తూ సింహద్వారాన్ని సమీపించాడు. శిష్యబృందం అనుసరించింది.

"ఏం మాధవశర్మా! బాగున్నావా?"

—ఉలిక్కిపడ్డాడు మాధవశర్మ. కృష్ణశాస్త్రిగారు తనని కుశలప్రశ్నలు అడుగుతున్నారు. నిజానికి తను ఆయన్ని అడగవలసినది. నెమ్మదిగా తలెత్తి, చేతులు జోడించి, "ఊఁ" అన్నట్లుగా తలూపాడు.

"ఈ పాటికి నటనలో ఎంతో గొప్ప వాడి వయ్యావనుకున్నానోయ్. పత్రికల్లో నీ పేరు చాలాసార్లు చూసి ఎంతో ఆనందించాను. కాని యిదేవిటోయ్ — చిన్నప్పటి నీ నటనతో పోల్చుకుంటే యిప్పటి నటన అసలు ఏమాత్రం విలువలేనిది. అసలు సహజత్వం ఏకోశానా లేదు, అబ్బే" అన్నారు ఆయన.

చెంపమీద ఛెళ్లున చరిచి నట్లయింది మాధవశర్మకు.

"నువ్వొక్కడివే కాదు. నీ బృంద మంతా అంతే. పాతకాలపు రంగస్థల నియమాలు పాటిస్తూ, యంత్రాల్లా తిరు గుతూ, మైకులున్నప్పటికీ గావుకేకలు పెడుతూ, విశేషించి సెట్టింగులని, లైట్లని వుపయోగించి నాటకాన్ని రసా భాసు చేస్తున్నా మీరు. నటనకి ప్రాధా న్యం ఏకోశానా కనిపించలేదు. నీ గురు వుగా నీ అభివృద్ధిని అపేక్షించి, యింత నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, అయా చితంగా అభిప్రాయం చెప్పడం బహుశా

అనుచితం కాదనుకుంటా. అన్నట్టు... ఇదిగో—ఈ అబ్బాయిని చూశావా?'' —చిరంజీవిని దగ్గరగా తీసుకుంటూ అన్నారాయన.

తలెత్తి, చిరంజీవివైపు చూడడానికి మాధవశర్మ చాలా కష్టపడ్డాడు.


"నమస్కారమండి" అన్నాడు చిరంజీవి.

ప్రతినమస్కారం చెయ్యడానికి మనస్కరించలేదు మాధవశర్మకి. అతనంటే మహా ఈర్ష్యగా వుంది. అవమాన భారంతో తల భూమిలోకి దించేసుకున్నాడు.

"ఇతను అమోఘమైన, అతి సహజమైన నటనని ప్రదర్శించాడు. ఇతనొక్కడే కాదు, ఇతని నాటకంలోని ప్రతి పాత్రా అతి సహజంగా వున్నాయి. నాటకీయతవున్న డైలాగులు గానీ, సన్నివేశాలు గానీ, నటనగానీ ఏమీలేవు. అంతా వాస్తవం, జీవితం. అదుగో అటు చూడు - యితని సమాజ సభ్యుల్ని అందరూకూడా యీరోజే ప్రప్రథమంగా రంగస్థల ప్రవేశం చేసినవారు. ఏ ఒక్కరికీ నటనలో ప్రవేశం లేదు. అందుకనే ఎవ్వరూ నటించలేదు. ఆయా పాత్రల్లో జీవించారు. వీరు తమ నాటక స్క్రీనిని ఎక్కడ చూపించారో తెలుసా— ఇవే సామాన్లున్న వారి స్వంత యింట్లో. ఆ నాటకానికి స్క్రిప్టు ముందుగా తయారుచేసుకోలేదుట. దర్శకత్వం లేదుట. ఏమీ లేదుట. కాని ఆ యింటిలోని ఆ పాప మొదలు తల్లివరకూ కళ వారిలో జీర్ణించుకుపోయివుంది. అందుకనే చిరంజీవి కోరగానే - ముందు తమ శక్తిని తక్కువగా అంచనా వేసుకుని వాళ్ళు అధైర్యపడ్డప్పటికీ - తర్వాత అంగీకరించారు. వారు ఎరిగున్న ఒక యింటి కరుణామయ కుటుంబగాధని యితివృత్తంగా తీసుకుని 'ఎక్టెంపోర్'గా ఒకరోజున ఇంట్లో వేసుకు చూసుకున్నారు. తర్వాత నలుగురూ కూర్చుని అవసరమయిన సలహాలు యిచ్చుకున్నారు. చిరంజీవి కోర్కె తీర్చడమే ఆ యింటిలోని వారి ముఖ్యోద్దేశం. అతని ఆనందంకోసమే యీ నాటకంలో పాల్గొన్నారుట. బహుమతు లందుకోవడాని క్కాదుట. అతన్ని ఆశీర్వదించు" అన్నారు కృష్ణశాస్త్రిగారు.

చిరంజీవి తన కాళ్ళకు దణ్ణం పెడుతూంటే మతిపోయినట్లయ్యింది మాధవశర్మకి. ఏమని దీవించాలోకూడా సమయానికి మాటలు రాలేదు. అతని తలపై చెయ్యివుంచి అలాగే వుండిపోయేడు.

చిరంజీవి నెమ్మదిగా లేచాడు. మాధవశర్మ అతని ముఖంలోకి యీసారి చూసాడు. చిరంజీవి కళ్ళల్లో నీళ్ళున్నాయి. అతని పెదవులపై చిరులాస్యం తాండవిస్తోంది. ముఖంలో వింత కళ. చేతులు జోడించి నిల్చున్నాడు. నెమ్మదిగా అతని పెదవులు విడివడ్డాయి.



"ఈ రోజు నా జన్మ తరించింది గురువుగారూ."

— కంగారుగా అతని ముఖంలోకి చూసాడు మాధవశర్మ.

"అవును గురువుగారూ! మీరే నా గురువు. మీ నాటకాలు విడవకుండా చూస్తున్నాను. మీ నటన నన్ను ముగ్ధుణ్ణి చేసేసింది. మీ శిష్యత్వం పొందాలని తహతహలాడాను. కనీసం మీ ఆశీర్వాద మన్నా పొందాలని ఎంతగానో వాంఛించాను. కానీ ఆ భాగ్యం పొందేదెలాగ? మిమ్మల్ని అర్థించే చొరవలేదు. అందుకనే ఏకలవ్య శిష్యత్వంచేసి, మీ నాటకాలన్నీ చూసి, నటన నేర్చుకుంటున్నాను. ఈ రోజు నా నాటకానికి బహుమతి లభించినందుకుగాని, నాకు బంగారు పతకం లభించినందుకుగాని నాకు సంతోషం లేదు ఎప్పట్నుంచో నేను కోరుకుంటున్నట్లుగా మీ ఆశీర్వాదం పొందే భాగ్యం లభించింది. అదే వంద బంగారు పతకాల పెట్టు. దయతో మీరు యీ పతకాన్ని స్వీకరించవలసిందిగా నా కోరిక. మీరే దీనికి అర్హులు".

* * *

శిష్యబృందం సహాయంతో యింటికి చేరిన మాధవశర్మ 'భగవాన్! నేనెంత మూర్ఖుణ్ణి! అహం నన్ను గ్రుడ్డివాణ్ణి చేసేసింది. నా అంతటి నటుడు లేడని విర్రవీగాను. గురువునే ధిక్కరించాను. కళకి ఎల్లలు లేవని గుర్తించలేకపోయాను. భంగపడ్డాను. గురుధిక్కారం, కీర్తి కండూతి, అహం నన్ను పూర్తిగా నాశనం చేశాయి. ఈ అవమానం చాలు. అంతకంటే నేను భరించలేను. ఇక ముందైనా నేను నిగర్వంగా మసులుకునేలాగ, శాయశక్తులా కళాసేవచేసేలాగ శక్తిని ప్రసాదించు' అంటూ నటరాజ విగ్రహం పాదాలచెంత వాలిపోయేడు.